వివిధ కోర్సుల పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 16: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఫార్మసీ (పీసీఐ) ఏడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 23 నుంచి, బీఈడీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను వచ్చే నెల 13 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవచ్చని సూచించారు.

రీవాల్యూయేషన్ ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా రీవాల్యూయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ, బీపీఈడీ, డీపీఈడీ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షల రీవాల్యూయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

పౌర హక్కుల దినం నిర్వహించాలి

డిప్యూటీ తహసీల్దార్ రంజనికి వినతిపత్రం అందజేస్తున్న కల్పన

బన్సీలాల్‌పేట్, జూలై 16 : ప్రతి నెల పౌర హక్కుల దినం నిర్వహించాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన కోరారు. ఈ మేరకు మంగళవారం ఆమె సికింద్రాబాద్ మండల కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ రంజనీ యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సమాజంలో నెలకొన్న కులం అసమానతలను రూపుమాపడానికి జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసుల మేరకు ప్రతి నెల చివరి రోజున పౌర హక్కుల దినం జరపాల్సిన భాధ్యత ప్రభుత్వానిదేనని ఆమె అన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడ్‌పల్లి/అమీర్‌పేట్, జూలై 16: దేశంలో ఎక్కడా లేని విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టింది. ఆ పథకాలు పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో అండగా నిలుస్తున్నదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అమీర్‌పేట మండల పరిధిలోని 29 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ...పేద, మధ్య తరగతి కుటుంబాలకు తమ ఇంటి ఆడపడుచు పెండ్లికి పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక లక్ష 116 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించేందుకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పటికే ఈ పథకాల ద్వారా లబ్ధిపొందని వారు తమ పరిసరాలలో అర్హులైన వారు సద్వినియోగం చేసుకునే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, తహసీల్దార్ భీమయ్య, బీఆర్ఎస్ పార్టీ నాయకులు అశోక్ యాదవ్, ప్రవీణ్‌రెడ్డి, నర్సింహ, బన్సీలాల్‌పేట డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, ఏసూరి మహేష్, కుర్మ లక్ష్మీపతి, శ్రీకాంత్‌రెడి పాల్గొన్నారు.

మారేడ్‌పల్లిలోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, తదితరులు

లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

బోర్డు సీఈఓ, అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే శ్రీ గణేష్

బోర్డు కార్యాలయంలో బోర్డు సీఈఓ మధుకర్ నాయక్, అధికారులతో సమస్యలపై చర్చిస్తున్న ఎమ్మెల్యే శ్రీ గణేష్

మారేడ్‌పల్లి, జూలై 16: వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్లు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో బోర్డు సీఈఓ మధుకర్ నాయక్, బోర్డు ఆయా విభాగాల అధికారులతో మంగళవారం ఎమ్మెల్యే శ్రీ గణేష్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వర్షా కాలంలో బస్తీ, కాలనీల్లో వర్షం నీరు నిలువకుండా చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. అత్యవసర సమయాల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు ప్రత్యేక టీంను ఏర్పాటు చేయాలన్నారు. కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఇప్పటి వరకు ఏ ఏ పనులు పూర్తి చేశారు, పెండింగ్‌లో ఏ ఏ పనులు ఉన్నాయి తదితర వివరాలను ఎమ్మెల్యే బోర్డు సీఈఓను అడిగి తెలుసుకున్నారు. పలు అభివృద్ధి పనుల కోసం ఎమ్మెల్యే బడ్జెట్ నుంచి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బోర్డు అధికారులు మహేందర్, దేవేందర్, ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

లష్కర్ బోనాలను విజయవంతం చేద్దాం

మహంకాళి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ సాధన

బేగంపేట్, జూలై 16: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతరను సమష్టి కృషితో విజయవంతం చేయాలని ఉత్తర మండలం డీసీపీ సాధన రష్మీపెరుమాళ్ కోరారు. మంగళవారం మహంకాళి పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో నార్త్‌జోన్ మీడియా ప్రతినిధులతో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీసీపీ సాధన రష్మీ మాట్లాడుతూ... ప్రభుత్వ శాఖల అధికారులు, వలంటీర్లు పోలీసులకు సహకరించాలని కోరారు. గత యేడాది మాదిరిగా ఏర్పాట్లు ఉంటాయని చెప్పారు. వీఐపీలు ఆలయానికి వచ్చే సమయాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రధానంగా అమ్మవారికి బోనాలు సమర్పించాలన్నారు. దేవాలయం లోపలి నుంచే ఐఅండ్‌పీఆర్ వారు ఎలక్ట్రానిక్ మీడియాకు అమ్మవారికి బోనాలు సమర్పణ, జాతర ఉత్సవాలకు సంబంధించి వీడియోల ఫీడ్‌ను కవరేజిని అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తర మండలం అదనపు డీసీపీ పగడాల అశోక్, ఏసీపీ సర్దార్‌సింగ్, మహంకాళి ఇన్‌స్పెక్టర్ పరశురాం తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలు సహకరించాలి

కాచిగూడ, జూలై 16 : ట్రాఫిక్ పోలీసులకు ప్రజలు సహకరించాలని కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం కాచిగూడలో లారీలు, కార్లు, ఆటోలపై స్పెషల్ డ్రివ్ నిర్వహించి, అధిక సౌండ్ కలిగిన వాహనాల డ్రైవర్లకు అవగాహన కల్పించి, కార్లకు అట్టించిన బ్లాక్ స్టిక్కర్లను తొలగించారు. వాహనాలకు పరిమితి మించి అధిక సౌండ్ చట్టరీత్యా నేరమని ఆయన అన్నారు. నిబంధనలు పాటించని వాహనాలను సీజ్ చేశారు. ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించని.. కాంగ్రెస్ నాయకులు

ప్రశ్నించినందుకు బీఆర్ఎస్ నాయకుల అరెస్టు

అరెస్టైన బీఆర్ఎస్ నేతలను పరామర్శిస్తున్న కార్పొరేటర్లు లింగాని ప్రసన్నలక్ష్మి, కందిశైలజ

అడ్డగుట్ట, జూలై 16 : కాంగ్రెస్ పార్టీ నేతలు అత్యుత్సాహంతో ప్రొటోకాల్ పాటించకుండా వ్యవహరిస్తున్నారని అడ్డగుట్ట, సీతాఫల్‌మండి, మెట్టుగూడ, బౌద్ధనగర్ కార్పొరేటర్లు లింగాని ప్రసన్నలక్ష్మి, సామల హేమ, రాసూరి సునీత, కంది శైలజ అన్నారు. మంగళవారం బోనాల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రొటోకాల్ పాటించకుండా వ్యవహరించడంతో కాంగ్రెస్ నేతలతో బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నేతలు వాగ్వాదానికి దిగారు. పరిస్థితి ఉద్రిక్తతంగా మారుతుండడంతో పోలీసులు బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేసి నల్లకుంట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో అరెస్టైన నేతలను కార్పొరేటర్లు ప్రసన్నలక్ష్మి, సామల హేమ, రాసూరి సునీత, కంది శైలజ లు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ... ప్రొటోకాల్ పాటించాలని ప్రశ్నించినందుకు బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. కాంగ్రెస్ నేతలు ప్రభుత్వ కార్యక్రమాల్లో జోక్యం చేసుకోవడం సరికాదని వారు తెలిపారు. అరెస్టైన వారిలో బీఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, ఆలకుంట హరి, సాయి, అమర్, ఎల్లయ్య, దేవయ్య, రాజేష్, నాగరాజు, మల్లి కార్జున్, మల్లేష్, శంకర్, మహేష్ ఉన్నారు.

బస్తీ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

అధికారులను ఆదేశించిన డిప్యూటీ మేయర్

బస్తీలో పర్యటిస్తూ సమస్యలు తెలుసుకుంటున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 16: ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఆరో నంబర్ బస్తీలో నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె బస్తీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా పరిశీలించి, వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. బస్తీలో విద్యుత్ సమస్యలపై ఓయూ ఇన్‌చార్జి వీసీ దానకిశోర్‌తో చర్చించి, సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్తానని చెప్పారు.

ఈ కార్యక్రమంలో టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి, ఏఎంహెచ్‌వో రజనీకాంత్, రాంకీ ఇన్‌చార్జి దశరథ్, ఎంటమాలజీ ఇన్‌చార్జి రాజశేఖర్, ఇతర అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ ఇబ్బందులు రాకుండా చూస్తాం

బోనాల చెక్కుల పంపిణీలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి

బోనాల చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్ రెడ్డి ,ఆదం సంతోష్ , డిప్యూటీ మేయర్, బీఆర్ఎస్ కార్పొరేటర్లు

సికింద్రాబాద్,జూలై 16: అందరం కలిసి మెలిసి చేసుకునే దేవుడి పండుగ, చిన్న చిన్న సమస్యలు వచ్చినా వాటిని అధిగమిస్తాం, ప్రొటోకాల్ సమస్య రానివ్వమని అందరికీ తగిన గౌరవం ఇస్తామని ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి తెలిపారు. సికింద్రాబాద్ సీతాఫల్‌మండిలో మంగళవారం జరిగిన నియోజక వర్గానికి సంబంధించిన అమ్మవారి దేవాలయాల బోనాల చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై నగర డిప్యూటీ మేయర్ శ్రీలతరెడ్డి, కార్పొరేటర్లు హేమ, సునీత,ప్రసన్నలక్ష్మి,శైలజలతో కలిసి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ..... సికింద్రాబాద్ లోని 205 దేవాలయాలకు సంబంధించి కోటి ఆరు లక్షల రూపాయల చెక్కులు పంపిణీ చేశామన్నారు. ఈకార్యక్రమంలో,బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు కొండల్ వెంకటేశ్వర్‌రావు,అనిల్,చక్రధర్,రాజేందర్,బబ్లూ ,మాదిరెడ్డి జలందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దోమల నివారణపై వాకర్లకు అవగాహన

ఇండ్ల పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకుంటూ దోమలను నివారించడం మన అందరి బాధ్యత అని జీహెచ్ఎంసీ బేగంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య అన్నారు. మంగళవారం ఉదయం ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో పద్మారావునగర్‌లోని జీహెచ్ఎంసీ పార్కులో వాకర్లకు 'దోమల నివారణ చర్యలపై' అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంటమాలజీ విభాగం ఏఈ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ..దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.– బన్సీలాల్‌పేట్

అంగన్వాడీ 'బడి బాట' ర్యాలీ

అమ్మ మాట – అంగన్వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం సనత్‌నగర్ సుభాష్‌నగర్ అంగన్వాడీ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం జరిగింది. అంగన్వాడీ టీచర్ సి.హెచ్.సుమతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కిశోర బాలికల సహా ఆశ వర్కర్లు, ఏఎల్ఎంసీ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు చేతిలో ప్లకార్డులతో తమ పిల్లలను అంగన్వాడీలో చేర్పించాలంటూ సుభాష్‌నగర్ పరిసరాల్లో ర్యాలీ నిర్వహించారు. – అమీర్‌పేట్

కలుషిత నీటి సమస్యను పరిష్కరించండి

అంబర్‌పేట, జూలై 16 : మహంకాళి అమ్మవారిగుడి పక్క బస్తీలో తాగు నీరు కలుషితమై వస్తున్నదని స్థానికులు కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి దృష్టికి తీసుకురావడంతో మంగళవారం వాటర్‌వర్క్స్ డీజీఎం విష్ణువర్ధన్‌రావు, మేనేజర్ మాజిద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, లైన్‌మెన్ ప్రేమ్ యాదవ్‌లతో కలిసి కార్పొరేటర్ ఆ బస్తీలో పర్యటించి, మంచినీటిని పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ కలుషిత నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులకు చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు మిర్యాల శ్రీనివాస్, గోవిందు అర్జున్, స్థానిక బస్తీ పెద్దలు తోపు పృథ్వీగౌడ్, బింది శ్రీనివాస్‌గౌడ్, కిషన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లో ప్రెషర్ సమస్యను పరిష్కరించాలి

జలమండలి అధికారులను కోరిన కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి,జూలై16 : గాంధీనగర్ డివిజన్‌లోని పలు బస్తీలు, కాలనీల్లో నెల కొన్న తాగునీటి లోప్రెషర్ సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ పావని జలమండలి అధికారులకు సూచించారు.

ప్రజల ఫిర్యాదు మేర కు ఆమె మంగళవారం డివిజన్‌లోని గిరినగర్ బస్తీలో పర్యటించి నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని అన్నా రు. బీజేపీ నాయకుడు ఎ.వినయ్‌కుమార్, జలమండలి గాంధీనగర్ మేనేజర్ కృష్ణమోహన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శంకర్, బస్తీలు వాసులు పాల్గొన్నారు.

ఉజ్జయినీ అమ్మవారికి నిత్య పూజలు

ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఘటాన్ని ఊరేగిస్తున్న దేవాలయం సిబ్బంది

ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి దేవాలయంలో భక్తుల సందడి

బేగంపేట్, జూలై 16: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని అమ్మవారి దేవాలయాల్లో భక్తులు అమ్మవారికి ఒడి బియ్యం, బోనాలు సమర్పించారు. ఈ క్రమంలో మంగళవారం ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. దేవాలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఈవో గుత్తా మనోహార్‌రెడ్డి తగిన సౌకర్యాలను కల్పించారు. ఈ సారి దేవాలయంలో అమ్మవారి దర్శనం చేసుకున్న అనంతరం భక్తులు బయటకు వెళ్లేలా మరో గేట్ ఏర్పాటు చేశారు. దీంతో దేవాలయంలో భక్తులకు తోపులాట లేకుండా సులువుగా అమ్మవారిని దర్శించుకుంటున్నారు.

ఘటానికి భక్తుల నిత్య పూజలు

బోనాల ఉత్సవాల్లో ప్రధానంగా అమ్మవారి ఘటాలు 15 రోజుల పాటు వీధివీధినా ఇంటింటికి వెళ్తుంటాయి. ఈ క్రమంలో దేవాలయానికి రాలేని భక్తులు అమ్మవారి ఘటానికి పసుపు, కుంకుమ, ఒడిబియ్యం సమర్పణ,కొబ్బరికాయలతో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఈ నెల 19 వరకు రోజుకో ప్రాంతానికి అమ్మవారి ఘటాన్ని తిప్పుతుంటారు.

అంతర్జాతీయ సంబంధాలను ప్రభావితం చేస్తున్న మీడియా

ఉస్మానియా యూనివర్శిటీ, జూలై 16 : ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ విభాగంలో 'మీడియా, అంతర్జాతీయ సంబంధాలు' అనే అంశంపై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇప్లూ కమ్యూనికేషన్ శాఖ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగరాజు హాజరై ప్రసంగించారు. 'రియలిజం', 'లిబరిజం', కన్‌స్ట్రక్టివిజం' వంటి దృక్కోణాలు, వాటి వాస్తవ ప్రపంచ ప్రభావాల గురించి వివరించారు. ఆధునిక మీడియా తన ఎజెండా సెట్టింగ్, ప్రచారం ద్వారా అంతర్జాతీయ సంబంధాలను, ప్రపంచ దృక్పథాన్ని ప్రభావితం చేసిందని ఆయన తెలిపారు.మొదటి, రెండవ సంవత్సరం విద్యార్థులు అధిక సంఖ్యలో ఉపన్యాసానికి హాజరై ఇంటరాక్టివ్ సెషన్‌లో పలు ప్రశ్నలను లేవనెత్తారు.



కార్యక్రమంలో పాల్గొన్న పొఫెసర్ డాక్టర్ నాగరాజు, తదితరులు

రైలు ఢీకొని రైల్వే ట్రాక్ మెన్ మృతి

మారేడ్‌పల్లి, జూలై 16: విధులు ముంగించుకొని తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఓ రైల్వే ట్రాక్ మెన్ పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొట్టడంతో మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...బీబీనగర్ గుడూరు ప్రాంతానికి చెందిన మహేందర్‌రెడ్డి (36) ఎస్ఎస్ఈ/ పీ డబ్ల్యూ ఏవై/ ఎస్‌సీ మౌలాలిలో ట్రాక్ మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం విధులకు హాజరై విధులు ముగించుకొని సాయంత్రం ఇంటికి వెళ్లే క్రమంలో మౌలాలి లోని గూడ్స్ క్యాబి న్ వద్ద స్టోర్ రూంకు వెళ్లి తిరిగి డౌన్ లైన్ పట్టాల పక్కన ఉన్న కంకరపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో రైలు రాకను గమనించని రైల్వే ట్రాక్ మెన్ మహేందర్‌రెడ్డిని రైలు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకున్నారు.

రైల్వే ట్రాక్‌మెన్ మృతి బాధాకరం

రైలు ప్రమాదంలో మృతి చెందిన రైల్వే ట్రాక్‌మెన్ కుటుంబానికి రైల్వే మజ్దూర్ యూనియన్ అండగా ఉంటుందని మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజనల్ సెక్రటరీ రవీందర్ అన్నారు. మంగళవారం మజ్దూర్ యూనియన్ నాయకులు, రైల్వే కార్మికులు రైల్వే ట్రాక్‌మెన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. యూనియన్ తరుపున రూ. 2 లక్షలు ప్రకటించగా, తక్షణ సాయంగా రూ. 50 వేలు,సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ తరుపున రూ. 10 వేలు సొసైటీ అధ్యక్షుడు చిలుకు స్వామి మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



లబ్ధిదారులకు ఆర్థిక సహాయం చెక్కులు అందజేస్తున్న కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి తదితరులు

బేగంపేట్, జూలై 16: పేద, మధ్య తరగతి ప్రజలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందాలని బేగంపేట్ కార్పొరేటర్ టి మహేశ్వరిశ్రీహరి సూచించారు. కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని బేగంపేట్ డివిజన్‌కు చెందిన 14 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకంలో మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్పొరేటర్ మహేశ్వరికి అందించారు. కాగా ఆ చెక్కులను మంగళవారం బేగంపేట్‌లో కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరిలు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మహేశ్వరి మాట్లాడుతూ...పేద, మధ్య తరగతి కుటుంబాలు ఆడపడుచుల పెళ్లిలకు ఇబ్బందులు పడకుండే ఉండేందుకు నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్ద మనస్సుతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఎంతో మంది ఆడపడుచులు ఈ పథకంలో లబ్ధిపొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు శ్రీహరి, సీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విశ్వ బ్రాహ్మణులను ఆదుకోవాలి

కాచిగూడ, జూలై 16 : విశ్వకర్మల్లో ఉన్న ఐదు కులాలు వృత్తులు ఆధారిత జీవనంలో ఉన్నారని, ప్రభుత్వం ఆదుకోవాలని గ్రేటర్ హైదరాబాద్ మనుమయ సంఘం అధ్యక్షుడు పోలోజు అశోక్‌చారి విజ్ఞప్తి చేశారు. 21న విశ్వబ్రాహ్మణ మనుమయ ఆధ్వర్యం లో ఇందిరా పార్క్ ధర్నాచౌక్ వద్ద తలపెట్టిన మహా ధర్నాకు సంఘీభావం తెలుపాలని మంగళవారం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌కు సంఘం ప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు. పోలోజు అశోక్‌చారి మాట్లాడుతూ.. కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న పంచవృత్తులకు ప్రభుత్వం చేయూత నందించాలని పేర్కొన్నారు.

IN THE COURT OF THE HON'BLE. XI JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT SECUNDERABAD
O.S.No. 419 Of 2024

Between:
KOTA KALYANI & Others ...Plaintiffs
AND
1. THE TEHSILDAR TRIMALGHERY MANDAL
2. ALL CONCERNED ...Defendants

PUBLIC NOTICE

To
All Concerned

This is to inform to general public that the Plaintiff have filled suit for Declaration to declare them as Legal heirs of deceased LATE KOTA VISHWANADHAM, S/o. KOTA VENKATA SWAMY, Who died on 20th February, 2024. As such general public are hereby informed you that if anybody having any objection kindly appear before the above Hon'ble Court on 18-07-2024 at 10.30 A.M. either in person or through Advocate, failing which matter will be decided as per law. Hence this notice.

// BY ORDER OF THE COURT //
MB SANTOSH KUMAR, M SRIDHAR, Advocates
Office: 3-41-1, Ashwini Nagar Colony,
West Marredpally, Secunderabad-500 026,
Cell No. 9391358882.